# ఎదురుచూపు

## వి. రాజారామమోహనరావు

"కావుంటుందంటావా ?" అంది లక్ష్మి.

"అదిగో మళ్ళీ మొదలెట్టావ్" అంది సుజాత.

"అది కాదే వాళ్ళెవరో నాకు తెలీదు పైగా నన్ను పిలవలేదు...నే వస్తే"

"కొంపేం మునగదులే...వాళ్ళు కాదు నిన్ను పిలిచింది నేను. నేను నీ కూడానే వుంటాను. నామాట విని లేచి తయారవు గబ్బిలంలా యీ గదిని పట్టుకుని వేళ్ళాట్టం కొంచెం తగ్గించు. లే... లే..." అంది.

కొన్ని అలవాట్లు ఎప్పుడు ఎలా అవుతాయో తెలియకుండానేఅవుతాయి. లక్ష్మి విషయంలోనూ అలాగే జరిగింది. లక్ష్మి వుద్యోగానికని హైద్రాబాద్వచ్చి ఎనిమిదేళ్ళు అయింది. మరీ పెద్దది కాని వో మందుల ఫ్యాక్టరీలో గుమాస్తా వుద్యోగం. లక్ష్మి జీతం మీద ఆధారపడ్డ తల్లి చదువుకుంటున్న తమ్ముడు వూళ్ళో వున్నారు. లక్ష్మిలాంటి ఎన్నోలక్షల మంది జీవితాల్ని నిర్దేశించిన ఎకనమిక్స్ లక్ష్మి జీవితాన్ని నగరంలో వొంటరిదాన్ని చేసింది. ప్రతీనెలా యింటికి డబ్బు పంపాలి. తమ్ముణ్ణి, తల్లిని సిటీకితీసుకొస్తే డబ్బు అసలు సరిపోదు. అందుకే జీవితాన్ని క్లుప్తంగా గడపటం కోసం త్రికోణాకారపు ఆ చిన్న గది అద్దెకు తీసికొని రోజులు గడుపుతోంది. గిరి గీసుకుని గడిపితే తప్ప గడవని జీవితం. అందుకే చాల సరదాలు లక్ష్మికి తెలియకుండానే చచ్చిపోయాయి.

ప్రతీరోజు ఆఫీసు, యిల్లు శెలవరోజున బట్టలుతుక్కోవటం యిల్లు కడుక్కోవటం, తలంటుకోటం లాంటి పనులు. వీటికి భిన్నంగా లక్ష్మి చేసేపని ఒక్కటే. నెలకి ఒకటి రెండుసార్లు సినిమాకి వెళ్ళటం. అదేనా సుజాతకి ఖాళీ వున్నప్పుడు. దీనికి మించిన సరదాలన్నింటినీ కావాలనే చంపుకుంది లక్ష్మి. వయసుని, ఆడతనాన్ని అణగదొక్కి బతకటం అలవాటు చేసుకుంది

సుజాతకీ లక్ష్మి వుద్యోగమే. ఇంచు మించు అదే జీతం. ఎటొచ్చీ లక్ష్మికంటే బాగా జూనియర్. ప్రస్తుతం ఒకచోట పనిచేస్తున్న పరిచయమే కాదు. భీమవరం హైస్కూల్లో ఇదరూ కలిసి చదువుకున్నారు లక్ష్మి చదువు హైస్కూలుతోఆగిపోయింద. తర్వాత చదువుకని సుజాత హైద్రాబాద్వచ్చి ఎమ్.ఎ. పూర్తిచేసింది. ఇద్దరూ చేసేది ఒకే వుద్యోగం అయినా ఇద్దరి జీవితాల్లో ఎంతో తేడా వుంది.

సుజాత అన్నగారింట్లో వుంటోంది. అతను స్టేట్ బ్యాంక్ లో ఆఫీసరు. జీతం అంతా సుజాత ఎలా ఖర్చు చేసుకున్నా పర్వాలేదు అదే వుద్యోగంలో పెరమనెంటుంగా వుండాలన్న వుద్దేశం కూడ లేదు సుజాతకి మంచి వుద్యోగం వచ్చినా, నచ్చిన మనిషి దొరికి పెళ్ళయినా యీ వుద్యోగం మానేసే వుద్దేశంలోనేవుంది. పెద్ద ఫ్రెండ్స్ సర్కిల్ వుంది సుజాతకి రోజూ ఏదో సరదా. ఏదో ప్రోగ్రాం వుంటూనే వుంటుంది. సురేష్ అన్న ఫ్రెండ్ బర్త్ డే పార్టీ. ఆ రోజు లక్ష్మి యింటి పరిస్థితి లక్ష్మి మానసిక పరిస్థితీ కూడా తెలుసు సుజాతకి. వున్నంతలో లక్ష్మి వుత్సాహంగా వుండాలని స్నేహితురాలిగా సుజాత తాపత్రయం.

తనకి వున్నవాటిల్లో అన్నింటికన్నా మంచి చీర కట్టుకుంది లక్ష్మి. కొద్దిగా స్నో, పౌడర్, వాల్జడ, పావుగంటలో తయారైంది. రూమ్కు తాళంవేసి ఇద్దరూ బైలుదేరారు.

సుజాతతో బయటకి వస్తే ప్రాణం హాయిగా వుంటుంది లక్ష్మికి. డబ్బుఖర్చు ఎలాఅని బెంగ గాని, ఎటువెళ్ళాలి ఏం చెయ్యాలి అని ఆలోచన గాని, అఖ్ఖర్లేదు. అన్నీ సుజాతే చూసుకుంటుంది. అయినా ఇప్పుడు బెరుగ్గా వుంది లక్ష్మికి. ఇలాంటి పార్టీలు నలుగురి మధ్యకి వెళ్ళటాలు అలవాటు లేనిపని. వెడితే ఎప్పుడేనా సినిమాకీ, బజారుకీ, గుడికీ తప్ప. ఇది కొత్తరకం ప్రయాణం. అక్కడ ఎవరెవరుంటారో, ఎలావుంటారో, ఎలా ప్రవర్తించాలో కంగారుగా వుంది లక్ష్మికి.

ఇద్దరూ కలిసి ఆటో ఎక్కారు. కొంతదూరం వెళ్ళేక లక్ష్మివేపు చూసింది సుజాత. చూసి "ఏమిటే ఏదో పరీక్షకి వెడుతున్నదాన్లా ముఖం పెట్టావు" అంది.

"అబ్బే ఏంలేదే. కొంచెం కొత్తకదూ అంతే" అంది లక్ష్మి నవ్వు తెచ్చుకుంటూ.

"ఒకసారి వెళ్ళేవరకే కొత్త. ఇవాళ కూడ రాకుండా తప్పించుకుంటావని అనుకున్నాను. మొత్తానికి ఎలాగైతేనేం బయలుదేరావు నాకదే ఆనందం" అంద సుజాత.

లక్ష్మేం మాట్లాడలేదు.

"చూడులక్ష్మి. రోజురోజుకి నీలోకి నువ్వు ముడుచుకు పోతున్నావు. రానురాను నీలోసరదా వుత్సాహం మరీ తగ్గిపోతున్నాయి. పరిస్థితి నాకు తెలియంది కాదు. జీవితం అందరికీ ఒకేలా వుండదు. నలుగురితో కలవటం నాలుగుచోట్ల తిరగటం అలవాటైతే కొంత వుత్సాహంగా వుంటుంది. నిన్ను నీవే ఇలా బంధించుకుంటే డల్ నెస్ తప్ప ఇంకేం వుండదు. ఇంత సోదీ ఎందుకు చెబుతున్నానో తెలుసా. మనంవెడుతున్న పార్టీ సురేష్ది. సురేష్ నాకు క్లోజ్ ఫ్రెండేకాదు. ఎంతో మంచి మనిషి. డబ్బున్నవాడే అయినా, అనవసర బేషజాలేం లేనిమనిషి. నిన్నేకాదు ఇంకా నలుగుర్ని తీసుకొచ్చినా, సంతోషించేమనిషి. అందుకే రమ్మన్నాను. ఫ్రీగావుండు. నీలోకంలోంచి బయటకిరా. ఎవరికి ఎన్ని సమస్యలున్నా సుఖంగా బతకటానికి ప్రయత్నం ఎప్పుడు చేస్తూనే వుండాలన్నది నా వుద్దేశం, ముఖ్యంగా ఈగందరగోళపు నగరంలో. మన గురించి మనం ఆలోచించుకోకపోతే రోజులు జీవితాన్ని తినేస్తూనే వుంటాయి. ఏళ్ళు గడిచిపోతూనే వుంటాయి. ఎప్పుడు వెనక్కి తిరిగి

**అక్కడి ఆడవాళ్ళ మధ్య తాను చాల సాదాగా వున్న సంగతి లక్ష్మికీ తెలుసు. తన సాదాతనం తనని వాళ్ళ నుంచి వేరుచేస్తోందనీ తెలుస్తున్నా ఎవరి ప్రవర్తనా లక్ష్మిని నొప్పించక పోవటంవల్ల లక్ష్మిగా గడిపింది.**



దూసుకున్నా ఏంలేనట్టే వుంటుంది" అంది సుజాత.

"నిజమే. సుజాత చెప్పింది. నిజమే. ఏళ్ళు తనని తినేస్తూనే వున్నాయి. అప్పుడే ముప్ఫైఏళ్ళు తనని తినేసాయి అన్నీ కావాలనుకుంటూ ఏం పొందలేని తన జీవితం ఏ మార్పు లేకుండా గడుస్తూనే వుంది. తనూ ప్రయత్నించాలి. మారాలి". లక్ష్మి ఆలోచన సాగుతుండగనే ఆటో సురేష్ మేడ చేరింది.

అక్కడి గాలి, వాతావరణం, మనుషులువాళ్ళ వేషభాషలు...ప్రవర్తన అంతా మరో లోకంలా వుంది లక్ష్మికి. మేడ టెర్రస్ మీద ఏర్పాటు చేశాడు డిన్నర్ సురేష్. బఫే... ఎవరూ లక్ష్మిని ప్రత్యేకంగా పరికించకపోయినా, మొహమాటపడాల్సిన అవసరం లేకపోయినా పక్కన సుజాత వుండి ప్లేటులో వెయ్యకపోతే లక్ష్మి తనంతగా తాను ఏమి తిని వుండేదికాదు.

కాస్సేపు బెరుకు బెరుకుగావున్నా, తర్వాత జంకుతగ్గింది లక్ష్మికి. సుజాత యించు మించు అందర్నీ పరిచయం చేసింది. అందరూ బాగానే మాట్లాడారు. అనవసరపు ప్రశ్నలు, అసభ్యపు గొడవ ఏ మాత్రం కనపళ్ళేదు లక్ష్మికి.

ఎక్కువగా ఇంగ్లీషు సినిమాలు గురించి, డిస్కో ఆల్బమ్స్ గురించి. పాపులర్ నవలలు... స్టూడెంట్స్ డిమాన్‌స్ట్రేషన్స్... యిలా రకరకాల మాటలు. తను మాట్లాడలేకపోయినా వింటానికి చాల వుత్సాహంగా వుంది లక్ష్మికి. సుజాత పరిచయం చేసిన వాళ్ళలో చాలమంది. లక్ష్మి గురించి పాస్ చేసిన కామెంట్ ఒక్కటే "చాల సింపుల్... యు ఆర్ వెరీ సింపుల్.." అని.

జీన్స్... గాగుల్స్...బ్రేస్‌లెట్స్...మేక్సీలు ముఖం మీద యింకో పొరలా మేకప్... దిద్దుకున్న కనుబొమ్మలు ఎక్కువగా ఆ తీరులోవున్న అక్కడి ఆడవాళ్ళ మధ్య తాను చాల సాదాగా వున్న సంగతి లక్ష్మికి తెలుసు. తన సాదాతనం తనని వాళ్ళ నుంచి వేరుచేస్తోందనీ తెలుస్తున్నా వాళ్ళలో ఎవరి ప్రవర్తనా ఏ మాత్రం లక్ష్మిని నొప్పించక పోవటం వల్ల అక్కడున్న రెండు గంటలూ చాల లైట్లీగా గడిపింది లక్ష్మి.

"ఆఫీసు... త్రికోణాకారపు గది. అడుగులు లెక్కపెట్టుకుని నడిచే జీవితం. ప్రతీరూపాయి. ప్రతీ నెలా లెఖ్ఖవేసుకోవటం వీటన్నిటినుంచీ ఎంత తేడా యీ జీవితం. యీ లోకం' స్వీట్స్... బిరియానీ ఐస్‌క్రీం... తిండిరుచి. చుట్టూ కొత్తదనం రుచీ. లక్ష్మి మనసుని ఏదో గుహలోంచి బైటకి తీసుకొచ్చినట్టు తీసుకొచ్చాయి. వయసు తెలిసిందగ్గర్నించీ అందులో వుద్యోగం వచ్చిందగ్గర్నించీ అణగదొక్కుతున్న ఎన్నో ఆశలు, ఆదనపు కోరికలు లక్ష్మిని ఒక్కసారిగా కమ్ముకున్నాయి. తిరిగి వచ్చేటప్పుడు సుజాత స్నేహితురాలి కార్లో వచ్చారు. లక్ష్మిని యింటి దగ్గర దింపి సుజాత అదే కారులో వెళ్ళిపోయింది. సాయంత్రం బైటకి వెళ్ళేటప్పుడు ఎలా వుందో సుజాత తనని దింపి వెళ్లేటప్పుడు అలాగే వుంది. పార్టీలోనూ అలాగే వుంది. అదే వుత్సాహం.

అదే నవ్వు ముఖం అనుకుంది లక్ష్మి గది తలుపు తీస్తూ.

అంత వుత్సాహంగా గడిచిన సాయంత్రం తనని ఎంతో వుత్సాహంగా వుంచుతుందనుకుంది లక్ష్మి. కానీ పూర్తి భిన్నంగా వుంది పరిస్థితి.

రూములోకివచ్చి తలుపు వేసేసి మంచంమీద వొరిగింది. ఏదో తెలియని నిస్త్రాణ. శారీరకం కాని నీరసం, మంచు పొగలా మనసుని, ఆలోచనని కమ్ముకుంటున్న నిరుత్సాహం.

'ఏమిటి? ఎందుకిలా?' అనుకుంది లక్ష్మి పార్టీలో కనిపించిన వ్యక్తుల్ని వాళ్ళమాటల్ని. జోకుల్ని ఫేషన్లని కావాలనే గుర్తుచేసుకుంది. అయినా మార్పేంలేదు. ఏదో క్రూరమైన సాంఘిక శక్తి తన నుంచీ, తనలాంటి ఎందరో ఆడపిల్లల్నుంచీ దూరంచేసిన అందమైన, మధురమైన జీవితం కళ్ళముందు స్పష్టంగా కనిపిస్తోంది. జారిపోతున్న వయసు తెలుస్తోంది.

రూమంతా కలయచూసింది. ప్రతీ వస్తువు, ప్రతి మూల పరిచయం వున్నదే! జరుగుతున్నదేమిటో తెలుస్తోంది.

నిజమే తను తిరిగి లోపలికి వెళ్ళిపోతోంది. తన ప్రపంచంలోకి...తన నాలుగు గోడల మనసు బంధిఖానాలోకి...సాయంత్రం జరిగిందంతా... ఆ అనుభవం, ఆ సరదా చాలా బావుంది. కానీ అది తనది కాదు, అది తన లోకంకాదు. నీటిలోంచి చేప వోసారి గాలిలోకి గెంతింది. అంతే!

నిజం యిబ్బందిగా వుంది లక్ష్మికి. మంచంమీద అటునుంచి యిటు, యిటునుంచి అటు దొర్లింది. సుజాత గుర్తొచ్చింది. సుజాత మాటలు గుర్తొచ్చాయి. ఉత్సాహం, సరదా ...నలుగురితో కలవటం–అన్నీ గుర్తొస్తున్నాయి.

'ఈ రోజు చాలామందితో పరిచయంఅయింది. అలా అని తిరిగి సుజాత లేకుండా వాళ్ళలో కలిసి గడపగలనా? లేదు...తనకి అలాంటి అవకాశం లేదు డబ్బు భయం. మరి తన జీవితం ఏమిటో? ఇలాగే ఆఫీసు...ఇల్లు...జీతం...మనియార్డర్... ఇంతేనా...?' ముప్పైయ్యేళ్ళ లక్ష్మి మనసుని యవ్వనం శూలంపోట్లు పొడుస్తోంది.

అలా ఆలోచిస్తూ పడుకున్న లక్ష్మికి తల్లి గుర్తొచ్చింది. తల్లి దగ్గర్నుంచి వచ్చే ఉత్తరాలు గుర్తొచ్చాయి. 'రాజమండ్రిలో సంబంధం ఒకటి వుందని తెలిసింది. వాకబు చేస్తున్నాను. కుర్రాడు బావుంటాడట! మంచి ఉద్యోగం. వివరాలు తెలుసుకుని, ఓ వారం ముందుగా రాస్తాను. పెళ్ళి చూపులకి తప్పనిసరిగా రావాలి...' అలాంటి ఉత్తరాలే కాదు జరిగిన రెండు మూడు పెళ్ళి చూపులు, పెళ్ళికొడుకులు గుర్తొచ్చారు. ఆ సమయంలో కన్న కలలూ, సాగిన ఊహలూ గుర్తొచ్చాయి. పెళ్ళవుతుంది. ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటారు. విశాలమైన యిల్లు, ఇబ్బంది లేని ఆర్థిక పరిస్థితి, బంధువులు...యిరుగూ పొరుగూ పేరంటాలు...వ్రతాలు...నలుగురి ముందూ ఫలానా ఆయన భార్య...మంచి జంట...అన్న పేరు...సరదా...సంతోషం.

అవేవీ జరగలేదు. కొన్నిచోట్ల కట్నం యిబ్బంది, మరి ఒకటి రెండు సంబంధాల విషయంలో ముప్పై దాటిన వయసు ఇబ్బంది.

అయినా లక్ష్మి తల్లి ప్రయత్నాలు చేస్తూనే వుంది.

అర్ధరాత్రి దాటినా నిద్రపట్టలేదు లక్ష్మికి. తెల్లారితే మళ్ళీ మామూలు జీవితమే అన్న బాధ గుర్తొస్తోంది. భిన్నంగా గడచిన సాయంత్రం గుర్తొస్తోంది. వాటితోపాటు కొన్ని గంటల్క్రితం ఈ సాయంత్రమేగా అనుకున్నాను 'ప్రయత్నించాలి, నీరసపడిపోకుండా నిలబడి మారాలి' అని అనుకుంది.

జరుగుతున్నదాంట్లో తను చెయ్యగలిగింది తక్కువే అని తెలుసు. అయినా ధైర్యం, ఉత్సాహం తెచ్చుకోవాలి అనుకుంది లక్ష్మి. 'ఏమో! ఏ క్షణానైనా తల్లి ప్రయత్నాలు ఫలించవచ్చు. ఏ గొడవలులేని సంబంధం కుదరవచ్చు'.

ఎన్నో లక్షలమందికి లాటరీమీద ఆశ. మరి కొంతమందికి రేసుల మీద, ఇంకా కొంతమందికి అద్భుతాల మీద. అలాగే లక్ష్మికి మంచి రోజు మీద ఆశ. నూటికి ఎనభయి మంది ఉద్యోగం కోసమో, పెళ్ళికోసమో రోజులు ఎదురుచూస్తూనే వున్నారు. లక్ష్మి ఎదురుచూస్తోంది జీవితంలో దేన్నీ వొదులుకోలేని ఏమీ చెయ్యలేని లక్ష్మి స్తబ్ధత. నిస్సత్తువుల మధ్య నిలబడి ఎదురు చూస్తోంది.

వీలున్నంతవరకూ లక్ష్మికి ధైర్యం, వుత్సాహం ఇంజెక్ట్ చేస్తూ, జీవితం మధ్యకి తీసికెడుతూ అప్పుడప్పుడేనా ఆ త్రికోణాకారపు గది, మనసు బంధిఖానాల్నుంచి బైటికి తీసికెడుతూ లక్ష్మి పూర్తిగా చచ్చిపోకుండా కాపాడుతూ స్నేహితురాలు సుజాతా ఎదురుచూస్తోంది. *


## పక్షం రోజులలో కొత్త ప్రభుత్వం సాధించిన కొంగ్రొత్త విజయాలు

ఆరుకోట్ల తెలుగు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలన్న కృతనిశ్చయంతో కార్యనిర్వహణకు నడుంకట్టిన నూతన ప్రభుత్వం ప్రథమ దశలో ప్రగతికి వెలుగుబాటుగా అన్న వాగ్దానాలను అమలుచేయడానికి చర్యలు తీసుకుంటున్నది.

**ఉదాహరణకు :**

- పేదలకు కిలో బియ్యం రెండు రూపాయలకు అందించటానికి, నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో పెట్టడానికి సంక్షేమ పథకాలు సిద్ధమయ్యాయి.
- పాఠశాలలను పాకశాలలుగా మార్చకుండా పరిశుభ్రంగా, బడిపిల్లలకు రొట్టె, పాలతో కూడిన ఉచిత మధ్యాహ్న ఆహార పథకం రూపొందించబడింది.
- విద్యాసంస్థలలో డొనేషన్ విధానాన్ని రద్దుచేసి, అక్రమాలను శాసనచేసి అర్హతకి అవకాశమిచ్చే నూతనాధ్యాయం ఆరంభమైంది.
- అన్ని రంగాలలో అవినీతిని, లంచగొండితనాన్ని నిర్మూలించటం ప్రారంభమైంది.
- సుస్థిర శాంతిభద్రతలు నెలకొల్పడానికి ఆడపడుచులకు రక్షణ కల్పించటానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు జరిగాయి.

రాష్ట్రాభివృద్ధి కార్యక్రమాలకు అన్ని వర్గాలవారి సహకారాన్ని నూతన రాష్ట్రప్రభుత్వం అర్థిస్తున్నది.

డైరెక్టరు, సమాచార, పౌర సంబంధ శాఖ; హైదరాబాదు.